క్లుప్తంగా

ఆపదలో ఉన్న వారికి సీఎంఆర్ఎఫ్ వరం



చెక్కు అందిస్తున్న సునీతారెడ్డి

నర్సాపూర్: ఆపదలో ఉన్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ పథకం వరంలాంటిదని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. గురువారం ఆమె తన స్వగృహంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్ ఫండ్ పథకానికి సీఎం కేసీఆర్ నిరంతరం నిధులు కేటాయిస్తూ పేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. నర్సాపూర్, చిలప్‌చెడ్ మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించారు. ఆమె వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు శేఖర్, లాయక్, శ్రీనివాస్‌గౌడ్, రాంచందర్, సత్యంగౌడ్, నర్సింలు, కిషోర్, మహేందర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, దావూద్, జీవన్‌రెడ్డి, మహ్మద్, బాల్‌రాజ్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

పంటపొలాల్లో కొండచిలువ

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని రుద్రారం గ్రామ శివారులోని చెరువు పక్కన పంట పొలాల్లో పెద్ద కొండ చిలువ కనిపించింది. చూసిన రైతులు భయందోళనకు గురవుతున్నారు. గ్రామ శివారులోని వాగులో కొండ చిలువను చూసిన రైతులు సర్పంచ్ లక్ష్మణ్ దృష్టికి తీసుకొచ్చారు. నాలుగు రోజుల నుంచి కొండచిలువ భయంతో రైతులు చెరువు కింద పంట పొలాల వద్దకు వెళ్లడం మానేశారు. అటవీశాఖ అధికారులు స్పందించి, కొండ చిలువను పట్టుకెళ్లాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వెండర్ మిషన్ ఏర్పాటు



మిషన్ ప్రారంభిస్తున్న సర్పంచ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని అంతారం గ్రామంలో ఐటీ హైదరాబాద్, సుజుకీ ఇన్నోవేషన్ సెంటర్ ఆధ్వర్యంలో సంయుక్తంగా వెండర్ మిషన్ ఏర్పాటు చేశారు. ఈ మిషన్‌ను సర్పంచ్ అశోక్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐసీ టెక్నీషియన్లు ప్రతాప్, రఘువంశీ మాట్లాడుతూ.. వెండర్ మిషన్‌లో చాక్లెట్లు, కూల్‌డ్రింక్స్, పప్పులు, నూనెలు, తదితర 60 రకాల కిరాణ వస్తువులు ఉంటాయన్నారు. మనకు కావాల్సిన వస్తువు కావాలంటే, మిషన్‌లో డబ్బులు వేసి, వస్తువుపై ఉన్న సంఖ్యను నొక్కితే, మనకు అవసరమైన వస్తువు బయటకు వస్తుందన్నారు. వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వెంకటాపూర్‌లో చెరువుకు గండి



వృథాగా పోతున్న నీరు

తూప్రాన్: పట్టణ పరిధిలోని వెంకటాపూర్ (పీటీ) గ్రామంలోని చెరువుకు బుంగ పడింది. గురువారం గుర్తించిన గ్రామస్తులు ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చి చూసి వెళ్లారు తప్ప బుంగ పూడ్చేందుకు చర్యలు చేపట్టలేదని వాపోయారు. ఫలితంగా చెరువు నుంచి నీరు వృథాగా పోతున్నాయని గ్రామస్తులు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

సర్వమత కులాల రక్షణ బీఎస్పీతోనే సాధ్యం

పార్టీ అందోల్ ఇన్‌చార్జ్ ప్రకాశం

రేగోడ్(మెదక్): సర్వమత కులాల రక్షణ బీఎస్పీతోనే సాధ్యమని బీఎస్పీ అందోల్ ఇన్‌చార్జ్ డాక్టర్ ముప్పారం ప్రకాశం అన్నారు. మండల కేంద్రం రేగోడ్‌లో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీఎస్పీ మండల నూతన అధ్యక్షుడు పల్లె సాగర్, ఉపాధ్యక్షుడు నాగప్ప, ప్రధాన కార్యదర్శి ఎనిగండ్ల పవన్, కార్యదర్శి బేగర్ యాదయ్య, కోశాధికారి రాజారామ్ తదితరులు పాల్గొన్నారు.



కొడిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో..



వెల్దుర్తిలో ఉట్టి కొడుతున్న చిన్నారులు



రామాయంపేట(మెదక్): శిశుమందిర్‌లో..

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

జిల్లా వ్యాప్తంగా గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆయా గ్రామాల్లోని చిన్నారులు కృష్ణుడి, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. అలాగే ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



చిలప్‌చెడ్(నర్సాపూర్): జగ్గంపేటలో కోలాటం ఆడుతున్న చిన్నారులు



మెదక్ మున్సిపాలిటీ: సరస్వతి శిశుమందిర్‌లో ..



చేగుంట(తూప్రాన్): హోమం చేస్తున్న భక్తులు



పాపన్నపేట(మెదక్): శ్రీవిద్య పాఠశాలలో..



శివ్వంపేట(నర్సాపూర్): దొంతి అంగన్‌వాడీ కేంద్రంలో ..



తూప్రాన్‌లో...



చిన్నశంకరంపేటలో శ్రీకృష్ణ ఆలయంలో ..

విఠల్‌రెడ్డి ఆశయసాధనకు కృషి



నర్సాపూర్‌లోని విఠల్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సునీతారెడ్డి



నర్సాపూర్‌లోని విఠల్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్: సీపీఐ నాయకుడు నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే దివంగత చిలుముల విఠల్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని గురువారం ఆయా పార్టీల నాయకులు పట్టణంలోని ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి పలువురు బీఆర్ఎస్ నాయకులతో వచ్చి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, విఠల్‌రెడ్డి కోడలు మాజీ ఎంపీటీసీ సుహాసిని, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ రాజమణి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఖాలేక్, పలువురు నాయకులు విఠల్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విఠల్‌రెడ్డి సేవలను కొనియాడారు.

కొడిపల్లి(నర్సాపూర్): దివంగత మాజీ ఎమ్మెల్యే, సీపీఐ సీనియర్ నాయకుడు కామ్రేడ్ చిలుముల విఠల్‌రెడ్డి ఆశయసాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తెలిపారు. గురువారం విఠల్‌రెడ్డి 107వ జయంతి సందర్భంగా కొడిపల్లిలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి విఠల్‌రెడ్డి ఎంతో కృషి చేశారని తెలిపారు. అయిదు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందాడన్నారు. ఆయన అడుగుజాడాల్లో నడుస్తూ ఆశయసాధనకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఎంపీపీ రాజునాయక్, సొసైటీ చైర్మన్ చిన్నంరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామాగౌడ్, యూత్ అధ్యక్షుడు కృష్ణాగౌడ్, జిల్లా రైతుబంధు సభ్యుడు శివాంజనేయులు, జిల్లా కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, నాయకులు సుహాసిని రెడ్డి, పైడి శ్రీధర్‌గుప్తా, దుర్గాగౌడ్, అమర్‌సింగ్, నర్సింగారావు, నాయికోటి రాజు, సుధీర్‌రెడ్డి, నవీన్‌రావు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి

తూప్రాన్: మత్స్యకారుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నాడని సర్పంచ్ నర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని యవపూర్ గ్రామ పెద్ద చెరువు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా నిండింది. దీంతో మత్స్యకారులు చెరువులో చేప పిల్లలను గురువారం సర్పంచ్‌తో కలిసి వదిలారు. కార్యక్రమంలో సర్పంచ్ శేరి నర్సింహారెడ్డి, ఎంపీటీసీ సంతోష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ యాంజాల స్వామి, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పిట్ల సత్యనారాయణ, చెట్లపల్లి చంద్రశేఖర్, పిట్ల శేఖర్, భూములు, నీల యాదగిరి, పాక నాగరాజు, చాకలి స్వామి, కొత్త దశరథ, తదితరులు పాల్గన్నారు.



చేప పిల్లలను వదులుతున్న సర్పంచ్, మత్స్యకారులు

ఉత్తమ ఉపాధ్యాయులుగా 'మోడల్'టీచర్ల ఎంపిక

రేగోడ్(మెదక్): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అందించే ఆందోల్ తాలుకా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు రేగోడ్ మోడల్ స్కూల్ నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ జయప్రకాశ్ గురువారం తెలిపారు. శుక్రవారం జోగిపేటలో నిర్వహించే కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎండి.ఖాజా, ఆంజనేయులు, మాధవిలకు అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందజేస్తారని చెప్పారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జయప్రకాశ్, ఉపాధ్యాయుల బృందం, ఉపాధ్యాయులను అభినందించారు.

సన్మానం



మల్లికను సన్మానిస్తున్న ఇఫ్కో డైరెక్టర్

మెదక్ మున్సిపాలిటీ: కార్మిక సంఘాల ద్వారా జాగృతి సేవా సంస్థ సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న మెదక్ జిల్లాకు చెందిన పట్లోళ్ల మల్లికకు హోలీ స్పిరిట్ క్రిస్టియన్ ఆర్గనైజేషన్ హెచ్ఎస్‌సీ యూనివర్సిటీ ఇటీవల గౌరవ డాక్టర్ అందజేసింది. ఈ సందర్భంగా జిల్లా ఆశ వర్కర్లు గురువారం మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. డాక్టరేట్ వచ్చిన సందర్భంగా డాక్టర్ మల్లికను ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కేవీ జిల్లా అధ్యక్షురాలు సమత, సంఘ బాధ్యులు శారద, చిన్నమ్మ, నాగమణి, లావణ్య, భాగ్య, మంజుల, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ నవీన్ బదిలీ

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేట ఎంపీడీఓ నవీన్ బదిలీ కావడంతో ఆయనను వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు గురువారం సన్మానించారు.

వరిలో తెగులు నివారణపై అవగాహన

నిజాంపేట(మెదక్): వరిలో తెగులు నివారణపై మండల వ్యవసాయ అధికారి సతీశ్ అవగాహన కల్పించారు. ఈ మేరకు గురువారం నిజాంపేటలో వర్షాకాలం వరి పంటని ఆశించే తెగుళ్ల నివారణ చర్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండాకు తెగులు ఆశించినప్పుడు ఆకులపైన పసుపు రంగు నీటి డాగు మచ్చలు ఏర్పడి ఆకుల వెంబడి అలల మాదిరిగా పై నుంచి కిందకి వ్యాప్తి చెందుతుందన్నారు. దీని నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రా, ప్లాంటమైసిన్ 0.4 గ్రా నీటికి కలిపి వర్షాలు తగ్గిన తర్వాత పిచికారీ చేసుకోవాలని తెలిపారు. అధిక వర్షాలు, గాలిలో అధిక తేమ శాతం ఉన్నప్పుడు పిలక నుంచి దుబ్బు చేసే దశలో అగ్గి తేగులు గమనించినట్లైతే ట్రైసైక్లోజెల్ + మాంకోజెబ్ 2.5 గ్రా లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. పాముపొడ తెగులు సోకినట్లయితే ప్రాపికోనజోల్ 1 మి.లీ లేదా హెక్సాకోనజోల్ 2 మి.లీ నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారిణి కావేరి తదితరులు పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

జోడోయాత్ర ప్రథమ వార్షికోత్సవం



నర్సాపూర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీలో నాయకులు



వెల్దుర్తి(తూప్రాన్): ర్యాలీలో రాజిరెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు

నర్సాపూర్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రథమ వార్షికోత్సవాన్ని కాంగ్రెస్ నాయకులు గురువారం పట్టణంలో సంఘీభావ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ పీసీసీ ఉపాధ్యక్షుడు, మెదక్ పార్లమెంట్ పార్టీ ఇన్‌చార్జ్ గాలి అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్‌జోడో యాత్రకు ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా పార్టీ పిలుపు మేరకు నర్సాపూర్‌లో సంఘీభావ ర్యాలీ చేపట్టామని చెప్పారు. ర్యాలీలో పార్టీ పీసీసీ డెలిగేట్ ఆంజనేయులుగౌడ్, పలువురు పార్టీ నాయకులు రిజ్వాన్, మల్లేశ్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, చిన్న ఆంజిగౌడ్, అశోక్‌గౌడ్, రషీద్, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రంలో చేపట్టిన ర్యాలీలో వైస్‌ఎంపీపీ సుధాకర్‌గౌడ్, మండలాధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, ఎంపీటీసీలు కృష్ణారెడ్డి, భాస్కర్‌గౌడ్, నాగరాజు, కుణాకర్‌రెడ్డి, కిషన్, దుర్గాగౌడ్, కిష్టాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి మండలంలో కొన్ని నెలలుగా కాంగ్రెస్‌లో అంతర్గత పోరు నడుస్తోంది. గురువారం ర్యాలీ సందర్భంగా నేతల మధ్య ఉన్న విభేధాలు ఒక్కసారిగా బయటపడ్డాయి. మండలాధ్యక్షుడు మహేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఓ వైపు, మండల సీనియర్ నాయకులు చేపట్టిన ర్యాలీలో ఉమ్మడి వెల్దుర్తి మండల నాయకులతో పాటు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో చేపట్టిన ర్యాలీలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాయిని మధు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి జనార్దన్, పట్టణాధ్యక్షుడు గంగారెడ్డి, రాంచందర్, కార్యకర్తలు తదితరులున్నారు.

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలో చేపట్టిన ర్యాలీలో మండల అధ్యక్షుడు మల్లేశం గౌడ్, మండల కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, ఓబీసీ సెల్ రాష్ట్ర నాయకుడు మురళీధర్ పంతులు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ అక్రం, బీసీ సెల్ అధ్యక్షుడు మల్లేశం, నాయకులు ప్రవీణ్ రెడ్డి, ఎల్లేశం, ఆగంగౌడ్, గొండ కృష్ణ, బాలరాజ్ పాల్గొన్నారు.

ఎంపీడీఓ పనితీరు మారాలి

- సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షురాలు శ్వేతారెడ్డి

టేక్మాల్(మెదక్): ప్రజాప్రతినిధులను లెక్క చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ పంచాయతీ కార్యదర్శులను మానసికంగా వేధిస్తున్న ఎంపీడీఓ పనితీరు మార్చుకోవాలని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు శ్వేత అన్నారు. గురువారం మండల కేంద్రం టేక్మాల్ ఎంపీపీ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ చింతస్వప్న ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు మాట్లాడారు. మండల అభివృద్ధి అధికారిగా ఉండి ఇన్ని రోజులు మీ పర్యవేక్షణ ఏమైందని, పంచాయతీ కార్యదర్శుల సమయపాలన ఇప్పుడు గుర్తుకు వస్తుందా అని అన్నారు. పారిశుద్ధ్యం పనులు ఇప్పుడు గుర్తుకు వస్తున్నాయా అంటూ ప్రశ్నించారు. ప్రజలకు సేవలందిచాల్సిన ఎంపీడీఓ ప్రజలు సమస్యలను చెప్పేందుకు వస్తే ఎందుకు వచ్చావ్ ఎవరిని అడిగి వచ్చావ్ అంటూ కొప్పడడం సరికాదన్నారు. ఎంపీడీఓ తీరుపై ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, కలెక్టర్‌కు విన్నవించామని, వెంటనే ఎంపీడీఓను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో టేక్మాల్ మేజర్ సర్పంచ్ నాయికోటి సుప్రజ భాస్కర్, పల్వంచ సర్పంచ్ శివకుమార్, కోరంపల్లి సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు రవి, చంద్రశేఖర్‌రెడ్డి, భాస్కర్, సర్దార్, అశోక్, సాయిరెడ్డి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

చెరువులు, కుంటలకు జలకళ



కొడిపల్లి(నర్సాపూర్): కొట్టాల చెరువు అలుగు వద్ద సర్పంచ్, గ్రామస్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): వర్షాలతో చెరువులు, కుంటలు నిండి అలుగు పారుతూ జలకళను సంతరించుకున్నాయి. కొట్టాల పెద్ద చెరువు వద్ద 34 ఏళ్ల తర్వాత నిండిన విషయం తెలిసిందే. దీంతో సర్పంచ్ నరహరి దంపతులతో పాటు గ్రామస్తులు అలుగు వద్ద సందడి చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ 'అందోల్ టికెట్ నాకే ఇవ్వాలి'

రేగోడ్(మెదక్): అందోల్ అసెంబ్లీ టికెట్ నాకే ఇవ్వాలని జెడ్పీటీసీల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్ అధిష్టానాన్ని కోరారు. మండల కేంద్రం రేగోడ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమంలోనూ.. ఆ తర్వాత పార్టీకి సేవలందించానని, పార్టీ కూడా తనను గుర్తించి జెడ్పీటీసీగా, ఫోరం రాష్ట్ర అధ్యక్షుడిగా పదవిని ఇచ్చారని చెప్పారు. పలు పదవుల్లో ఉంటూ ప్రజా సేవ కోసం నిరంతరం పని చేస్తున్నానని తెలిపారు.

◆ అవినీతిపై పోరాడుతాం

చిన్నశంకరంపేట(మెదక్): పాండవులవలే అవినీతిపై పోరాడుతామని ఏఎంసీ మాజీ చైర్మన్ గంగా నరేందర్, సర్పంచ్ రాజిరెడ్డి అన్నారు. గురువారం ఏడుపాయల బయలుదేరే ముందు అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం చిన్నశంకరంపేట నుంచి యువకులతో కలిసి బైక్ ర్యాలీగా ఏడుపాలయ వెళ్లారు. మాజీ ఎంపీపీ అరుణాప్రభాకర్, మెదక్ బీఆర్ఎస్ నాయకుడు జీవన్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

◆ అభినందన

టేక్మాల్(మెదక్): మెదక్ జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ప్రవీణ్‌కుమార్‌ను సీడబ్ల్యూసీ శాశ్వత సభ్యులు, మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహ గురువారం నియామక పత్రం అందించారు. తనను ఎన్నుకున్న దామోదర్‌ను ప్రవీణ్ సన్మానించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్, మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాన్ కిషన్, మల్లారెడ్డి, సత్యనారాయణ, నర్సింహారెడ్డి, రాంచందర్, నాగయ్య, చిన్నమల్లేశం, తుకారం, కిషోర్, సంగమేశ్, సేవాలాల్, మైనార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు మజహర్, ఎన్ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాహేశ్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సంగమేశ్వర్‌గౌడ్, ఎన్ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు అడివయ్య పాల్గొన్నారు.

◆ ఆటోను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు – ఐదుగురికి గాయాలు

రామాయంపేట(మెదక్): రోడ్డు పక్కన నిలిపి ఉన్న ఆటోను ట్రావెల్ బస్సు ఢీకొనడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం నార్సింగి మండలంలోని వల్లూరు స్టేజీ వద్ద జరిగింది. నార్సింగిలో ప్రయాణికులను ఎక్కించుకొని చేగుంట వైపు వెళ్తున్న ఆటోను వల్లూరు స్టేజీవద్ద ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీ కొనడంతో ఆటో బోల్తా పడగా, ఆటో డ్రైవర్ ఉప్పరి శ్రీనుతో పాటు నార్సింగి మండలానికి చెందిన ప్రయాణికులు గజగట్ల కీర్తన, పుండరీకం, లక్ష్మి, గడ్డం స్వామితో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

◆ విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన్న లారీ

చేగుంట(తూప్రాన్): విద్యుత్ స్తంభాన్ని లారీ ఢీ కొనడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిన సంఘటన చేగుంట శివారులోని 44వ జాతీయ రహదారిపై గురువారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. చేగుంట వడియారం గ్రామాలకు సరఫరా అయ్యే విద్యుత్ లైన్ స్తంభానికి లారీ ఢీ కొట్టింది. దీంతో ఏ అపాయం జరగలేదు. అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేసి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

◆ బీఆర్ఎస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా బిక్యానాయక్

రామాయంపేట(మెదక్): బీఆర్ఎస్ ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడిగా నర్సంపల్లి తండాకు చెందిన బిక్యానాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ మండలాధ్యక్షుడు మైలారం బాబు, తండా అధ్యక్షుడు బాషానాయక్ నియామక పత్రం బిక్యానాయక్‌కు అందజేశారు. ఉపాధ్యక్షుడిగా గోపాల్ నాయక్, వసురాంనాయక్, కార్యదర్శిగా శ్రీకాంత్, యూత్ అధ్యక్షుడిగా జగన్, ఉపాధ్యక్షుడిగా సుభాశ్, సోషల్ మీడియా ప్రతినిధులుగా మహేశ్, గణేశ్, సురేశ్, సంతోష్, రాజును ఎన్నుకున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

పాపన్నపేట(మెదక్): ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలోని ఎల్లాపూర్ శివారులో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగసాన్‌పల్లి గ్రామానికి చెందిన అశోక్ బైక్‌పై మెదక్ వెళ్లాడు. మెదక్‌లో పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో.. ఎల్లాపూర్ వంతెన వద్ద బైక్ అదుపుతప్పి అశోక్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయనను మెదక్ తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

◆ కృష్ణస్వామి సేవలు మరువలేనివి

గజ్వేల్‌రూరల్: ముదిరాజ్‌ల ఐక్యతకు పాటు పడిన గొప్ప వ్యక్తి కొరివి కృష్ణస్వామి అని ముదిరాజ్ యువసేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటుకు శ్రీనివాస్, నియోజకవర్గ కొరివి కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు నాగేష్, ముదిరాజ్ యూత్ అధ్యక్షుడు రిప్పల స్వామి కొనియాడారు. కృష్ణస్వామి జయంతి సందర్భంగా గురువారం గజ్వేల్ పట్టణంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా గజ్వేల్, మర్కూక్ మండలాల నూతన కమిటీలను ఎన్నుకున్నారు.